జిల్లా సర్వీసులను అందుబాటులోకి తేవాలి



రవాణా శాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్, యాదగిరియాదవ్

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పట్టణంలోకి జిల్లా బస్సులు నడిపించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌ యాదగిరియాదవ్‌ శుక్రవారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రైల్వే బ్రిడ్జీ పనుల కారణంగా జిల్లా బస్సులు బైపాస్‌ రోడ్డు మీదుగా వెళుతున్నాయని, దీంతో రాత్రి వేళల్లో పట్టణానికి చేరుకునేందుకు వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో మాదిరిగానే యాదగిరిగుట్ట, వరంగల్, జనగాం. పికెట్‌ బస్సులు తిరిగి నడిపించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



హైమాస్ట్‌ లైట్లను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి

మేడ్చల్‌: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక 14 వ వార్డులోని ఐటీఐ జంక్షన్‌ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్లను కమిషనర్‌ నాగిరెడ్డి, కౌన్సిలర్‌ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో వీధి దీపాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు పనులను పూర్తి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు అందజేస్తున్న సంఘం నాయకులు

మేడ్చల్‌: పీఆర్‌టీయుటీఎస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు అందజేశారు. పీఆర్‌టీయుటీఎస్‌ యూనియన్‌ రూపొందించిన గుర్తింపు కార్డులను పాఠశాలలకు వెళ్లి స్వయంగా అందజేశారు. కార్యక్రమాల్లో సంఘం నాయకులు,ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, సంజీవరెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు పూర్తి చేయాలి



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న క్రిస్టియన్‌ అసోసియేషన్‌ సభ్యులు

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌లో వంతెన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో క్రిస్టియన్‌ అసోసియేషన్‌ సభ్యులు కృపానిధి, కుమార్, జాషువా, రమేశ్, ఎఫ్రైమ్, కేశవ్‌కుమార్, రిబ్కాశ్యామ్, రుబీన్‌ పాల్గొన్నారు. వారికి మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, డైరెక్టర్‌ లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్‌ వెంకట్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.

పాత ఆసుపత్రి ఆవరణలో మార్కెట్‌ యార్డు ఏర్పాటు చేయాలి

మేడ్చల్‌: పట్టణంలోని రైల్వేస్టేషన్‌ రోడ్డులో ఖాళీగా ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మార్కెట్‌ యార్డు ఏర్పాటు చేయాలని 16వ వార్డు మున్సిపల్‌ కౌన్సిలర్‌ ఉమానాగరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కమిషనర్‌ నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌ రోడ్డు విస్తరణ, హౌసింగ్‌ బోర్డు కాలనీ రోడ్డు మూసివేత కారణంగా చిరు వ్యాపారులు నిరాశ్రయులయ్యారని వారికి చేయూతనందించాల్సిన అవసరం ఉందన్నారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని పాత భవనానికి మరమ్మతులు చేసి మార్కెట్‌ యార్డుగా తీర్చిదిద్దాలన్నారు. వ్యాపారులతో పాటు వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధం



శామీర్‌పేట్‌: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన మాణిక్యం, అనిత దంపతులు కూలీ పని చేస్తూ జీవనం సాగించేవారు. శుక్రవారం వారు తమ ఇద్దరు పిల్లలను స్కూల్‌ పంపించి, ఇంటి తాళం వేసి పనికి వెళ్లారు. అ తర్వాత కొద్ది సేపటికి ఇంట్లో నుంచి పొగలు వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు మాణిక్యం అనితలకు సమాచారం అందించి, మంటలను ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మంటలు వ్యాపించడంతో గృహోపకరణాలతో పాటు ఇంట్లో దాచుకున్న రూ. 25 వేలు కాలి బూడిదయ్యాయి. కట్టుబట్టలతో మిగిలామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పండుగ చేసుకుందాం..

- నేడు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో సంబురాలు
- వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు మెస్‌ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు
- సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ముఖాముఖి



సాక్షి,సిటీబ్యూరో: మెస్‌ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం విద్యాలయాల్లో సంబురాలు నిర్వహించనున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 8 ఏళ్ల తర్వాత ప్రభుత్వం మెస్‌ చార్జీలు పెంచింది. అంతేగాక 16 ఏళ్ల తర్వాత విద్యార్థులకు నెలవారీగా అందించే కాస్మోటిక్‌ చార్జీలు ,సబ్బుల చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మూడో తరగతి నుంచి 7వ,తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మెస్‌ చార్జీలు నెలకు రూ.950 నుంచి రూ.1330కు పెంచగా, కాస్మోటిక్‌ చార్జీలు రూ.55 నుంచి రూ.175 వరకు, 8వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నెలకు మెస్‌ చార్జీలు రూ.1100 నుంచి రూ.1540వరకు ,కాస్మోటిక్‌ చార్జీలు రూ.75 నుంచి రూ.275 వరకు పెంచారు . హెయిర్‌ కటింగ్‌ చార్జీలు 3 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.62 నుంచి రూ.150 వరకు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.62 నుంచి రూ.200 వరకు ప్రభుత్వం పెంచింది. అలాగే కాలేజీ విద్యార్థులకు నెలకు మెస్‌ ఛార్జీలు రూ.1500 నుంచి రూ.2100 కు పెంచారు.

వేడుకలు ఇలా..

మేడ్చల్‌ జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు సంబంధించిన 61 హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో ప్రముఖులను ఆహ్వానించి, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో రోజువారీగా అందించే ఆహార పదార్థాల పట్టికను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పదార్థాలతో రుచిగా, శుచిగా ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారని అవగాహన కల్పించనున్నారు. ప్రతి ఆదివారం మెనూలో విద్యార్థులకు ప్రత్యేకంగా చికెన్‌తో వండి వడ్డించే ఆహారాన్నే ఆ రోజు పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విందు భోజనంగా అందించనున్నారు

కార్యక్రమాలు ఇవీ..

మేడ్చల్‌ జిల్లాలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి/ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ /కలెక్టర్/ కమిషనర్‌ తదితర ప్రముఖులు హాస్టళ్లను సందర్శించి తనిఖీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30: సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రముఖులు సహపంక్తి భోజనాలు చేస్తారు.

ఆకట్టుకున్న సైన్స్‌ ఎగ్జిబిషన్‌

కీసర: అగస్త్య ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నాగారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్‌ ఎగ్జిబిషన్‌ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను ఆయన తిలకించారు. వర్షం పడేటప్పుడు బయట ఆరవేసిన బట్టలు ఆటోమేటిక్‌గా తడవకుండా కాపాడే టెక్నికల్‌ నమూనా, డ్రైనేజీలోకి మనుషులు దిగి అనారోగ్యం బారిన పడకుండా ఆటోమేటిక్‌ డ్రైనేజీ క్లీనర్, భూకంపాన్ని పసిగట్టే పరికరం వంటి నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కౌన్సిలర్‌ శ్రీనివాస్‌గౌడ్, స్కూల్‌ హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు వనజ, రాజ్యలక్ష్మి, అరవింద్‌రెడ్డి, శ్రీదేవి, రఘు, వందన, వరమ్మ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



నమూనాలను తిలకిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి

కురుమల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

మేడ్చల్‌: కోకాపేట్‌లో శనివారం నిర్వంచనున్న కురుమల ఆత్మగౌరవ సభను జిల్లా నుంచి కురుమలు అధిక సంఖ్యలో హాజరైన విజయవంతం చేయాలని మేడ్చల్‌ మున్సిపల్‌ కౌన్సిలర్‌ కొడె మహేష్‌ కురుమ అన్నారు. కోకాపేట్‌లో నిర్మించిన కురుమల ఆత్మగౌరవ భవనాన్ని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని, ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఎడిపై పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్‌: ఎలాంటి అనుమతులు లేకుండా ఎల్లంపేట్‌ గ్రామంలో కొనసాగుతున్న ఎడిపై పాఠశాలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాఠశాల ఆవరణలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పాడి పరిశ్రమ కొనసాగిన భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు ప్రారంభించారని వారు ఆరోపించారు. దీనిపై స్పందించిన ,విద్యాశాఖ అధికారులు పాఠశాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ధర్నాలో జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి సంతోష్, మండల కార్యదర్శి కిరణ్, నాయకులు పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



వెంకట్‌ రమణ మృతదేహం

కీసర: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కీసర పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కీసరకు చెందిన వెంకట్‌ రమణ కుటుంబ ఖర్చుల నిమిత్తం దాస్‌ అనే వ్యక్తి వద్ద అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని అతను ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి లోనైన వెంకట్‌ రమణ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరణ ఆటోలపై నిరంతర నిఘా

కాప్రా: సర్కిల్‌ పరిధిలోని కాలనీల్లో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే ఆటోలను పర్యవేక్షించేందుకు సాకేత్‌ సమీపంలోని గార్బేజ్‌ ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా ఆటో నుంచి వచ్చే చెత్త డంపింగ్, అక్కడి నుంచి డంపింగ్‌ యార్డుకు తరలించే లోడింగ్, అన్‌లోడింగ్‌ విధానాన్ని పర్యవేక్షించనున్నారు. ఒక్కో ఆటో ఎన్ని ట్రిప్పులు తీసుకొస్తున్నారు, డంపింగ్‌ కోసం ఎంత సమయం పడుతుంది, ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌ వచ్చే ముందు చెత్త రోడ్లపై పడకుండా టార్పాలిన్‌ కవర్‌తో ప్యాక్‌ చేస్తున్నారా లేదా, ఆటోల్లో బాల కార్మికులు పని చేస్తున్నారా అనే విషయాలను గుర్తించేందుకు ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అంజలి, ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌ సూపర్‌ వైజర్‌ చందు తదితరులు పాల్గొన్నారు.



సాకేత్‌ సమీపంలోని గార్బేజ్‌ ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్‌: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని బచపన్‌ అకమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ టెక్నికల్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ ఆపరేషన్స్‌ కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోడుప్పల్‌ బచ్‌పన్‌ అకడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్‌ స్కూల్‌ కాంపిటేషన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుంచి పోటీతత్వాన్ని పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు స్పోర్ట్స్, ఫైన్‌ ఆర్ట్స్, లిటరసీ విభాగాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలిమాదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. శుక్రవారం ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్‌ కళాశాలలో నిర్వహించిన ''వాయిస్‌ ఫర్‌ బాయ్స్‌'' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యకు అధిక సమయం కేటాయించి ప్రభుత్వం, తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ వేణుగోపాల్, వైస్‌ ప్రిన్సిపల్‌ భాషా, లోహిత్, నాగరాజు, అమరేందర్, సాయిచరణ్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవల్లో మేడ్చల్‌ జిల్లా ఫస్ట్‌

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌.టి. రఘునాథ్‌స్వామి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ రఘునాథ్‌స్వామి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించడంలో మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. పలు పథకాలు మేడ్చల్‌ జిల్లా నుంచి ప్రారంభం కావడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు.

- జిల్లాలో టీబీ ఫ్రీ జోన్‌ ను ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందని, ఇందుకు మూడు మున్సిపల్‌ కార్పొరేషన్లను పైలట్‌ ప్రాజెక్టుగా ఎంచుకున్నామన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నట్లు తెలిపారు. అడల్ట్‌ బీసీజీ, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు టీబీ పై అవగాహన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.
- జిల్లాలో రోహిణి ఫౌండేషన్‌ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్కూల్‌ విద్యార్థులకు స్క్రీనింగ్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పిల్లల్లో రక్త హీనత, పళ్లను పరీక్షించి అవసరమైన చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. పేదలు ఎక్కువగా నివసించే జవహర్‌ నగర్, బాలాజీ నగర్‌ లాంటి ప్రాంతాల్లో మొబైల్‌ వ్యాన్ల ద్వారా సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. డయాబెటిక్‌ వ్యాధి గ్రస్తుల్లో పెరిపెరల్‌ స్టేజీ ని ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.
- గర్భిణుల్లో రక్త హీనతను గుర్తించి, వారికి తగిన విధంగా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ శ్రీదేవి, డాక్టర్‌ కౌశిక్‌ పాల్గొన్నారు.

మజ్దూర్‌ యూనియన్‌ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న యూనియన్‌ నేతలు

ఘట్‌కేసర్‌: దక్షిణ మధ్య రైల్వే జోన్‌ యూనియన్‌ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ ప్రత్యర్థి ఎంప్లాయీస్‌ యూనియన్‌పై భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఈ సందర్భంగా పట్టణంలోని సీపీడబ్ల్యూ కార్యాలయం నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బ్రాంచ్‌ సెక్రటరీ బొల్లేపల్లి శ్రీనివాస్, అసిస్టెంట్‌ సెక్రటరీలు అన్నపూర్ణ, హరికృష్ణ, శ్రీకాంత్, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, యూత్‌ కన్వీనర్‌ అనుమేశ్‌కుమార్, అశోక్, సన్నీకుమార్,ఎం శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, సుజాత, ఇమ్రాన్, జిక్కిబాబు, సుధాకర్‌ పాల్గొన్నారు.

శ్రీనిధి కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌ గ్రామ వికాస్‌



ఎన్‌ఎస్‌ఎస్‌ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, వలంటీర్లు

శామీర్‌పేట్‌: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి యువత సహకరించడం అభినందనీయమని మూడుచింతలపల్లి ఎంపీడీఓ కె. ఎల్‌ వత్సలా దేవి అన్నారు. మూడుచింతలపల్లి మండలం, కేశ్వాపూర్‌ గ్రామంలో శ్రీ నిధి ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ గ్రామ వికాస్‌ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కేశ్వాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ ఏడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్, కళాశాల ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ ప్రీతిజీవన్, ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

- 2 తులాల బంగారు నగలు
- 25 తులాల వెండి అపహరణ



చెల్లా చెదురైన వస్తువులు

మేడ్చల్‌రూరల్‌: గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మేడ్చల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో ఎండి ఖాజాపాషా కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 9న కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వెళ్లిన అతను గురువారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగిలి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూడగా ఇంటిలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించిన అతను పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌ టీంతో ఆధారాలు సేకరించారు. 2 తులాల బంగారం, 25 తులాల వెండి, కొంత నగదు అపహరణకు గురైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేయాలి



వివిధ సంఘాల మద్దతు...

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ విద్యా శాఖ సమగ్ర శిక్ష విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్‌ ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలని, ఇతర పెండింగ్‌ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)డిమాండ్‌ చేసింది. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని ఏఐవైఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్‌ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్‌ సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 2023లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌ రెడ్డి కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్‌ చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించడం శోచనీయమన్నారు. జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్, టెక్నికల్‌ పర్సన్స్, ఆపరేటర్లు, డేటా ఎంట్రీ, క్లస్టర్‌ రిసోర్స్‌ పర్సన్, స్పెషల్‌ ఆఫీసర్స్, అటెండర్లుగా పని చేస్తున్న 109మంది ఉద్యోగులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యా శాఖలో విలీనం చేసి, రెగ్యులరైజ్‌ చేయాలని, ఉద్యోగ భద్రతతో కూడిన పేస్కేల్‌ ఇవ్వాలని వారు డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణి కుమార్, ప్రతినిధులు దేదీప్య, మల్లేష్, కిరణ్, స్వామి,సత్యనారాయణ, ఇందిరా, మధులత, నిర్మల పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌టీయూ, టీయూటీఎఫ్‌ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఆయా సంఘాల జిల్లా నేతలు జయసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి,మదన్‌ రెడ్డి, వెంకటేశ్వర్లు వారికి మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.